ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి ములుగు
5
శుక్రవారం 18 అక్టోబరు 2024



రేపు జిల్లాస్థాయి 'కళా ఉత్సవ్'

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు ఈనెల 19న ములుగులోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు డీఈవో పాణిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన ఆరు అంశాలలో ప్రథమ స్థానంలో నిలిచినవారిని ఎంఈవోలు ఒక్కో గైడ్‌టీచర్ సహకారంతో జిల్లాస్థాయి పోటీలకు పంపించాలని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వారి అంశాలకు సంబంధించిన సామగ్రిని వెంట తెచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

రామప్పలో కొనసాగుతున్న వలంటీర్ల శిక్షణ

పలు అంశాలపై అవగాహన కల్పించిన నిపుణులు

వివరాలు 8వ పేజీలో..

ఇక అడ్వాన్స్‌డ్ ఐటీఐలు

పారిశ్రామిక శిక్షణ సంస్థకు మహర్దశ



- ఆరు కొత్త టెక్నికల్ కోర్సులకు శ్రీకారం
- నైపుణ్యంతోపాటు ఉపాధి కల్పనే సర్కారు లక్ష్యం
- దరఖాస్తులను ఆహ్వానిస్తున్న యంత్రాంగం
- భూపాలపల్లిలో ఈనెల 30 వరకు గడువు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక విద్య దినదినాభివృద్ధి చెందుతోంది. ఐటీఐలకు మహర్దశ పడుతోంది. యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రైవేటు రంగ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వం కొత్తగా టెక్నికల్ కోర్సులను ప్రవేశపెడు తోంది. అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం కాగా మరికొన్ని రోజుల్లో గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో యంత్రాంగం దీనిపై విస్తృతంగా ప్రచారం నిర్వహించ నుంది. విద్యార్థులు ఐటీఐల్లో ప్రవేశం పొందాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ సైతం పిలుపునిచ్చారు. జిల్లాలో రెండు ప్రభుత్వ ఐటీఐలు (పారిశ్రామిక శిక్షణా సంస్థ) ఉన్నాయి. భూపాలపల్లిలో ఒకటి, కాటారంలో మరొకటి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఐటీఐలను అప్‌గ్రేడ్ చేస్తోంది. ఇందులో భాగంగా ఆరు కొత్త కోర్సుల ను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు ఉన్న కోర్సుల ద్వారా ప్రభుత్వ, ప్రైవేటురంగ సంస్థల్లో ఉపాధి అవకాశాలు అంతంత మాత్రమే దక్కుతుండటంతో ఈ మేరకు చర్యలు చేపట్టింది. మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వం 25 ఐటీఐల్లో ఈ కొత్త కోర్సులు ప్రారంభించనుండగా ఆ జాబితాలో భూ పాలపల్లి కూడా ఉంది. రెండో జాబితాలో కాటారం ఉంది. ఇక్కడ డిసెంబరులో అడ్మిన్లు ప్రారంభం కానున్నా యని తెలుస్తోంది. భూపాలపల్లిలో ఈనెల 15 నుంచి అడ్మిషన్లు ప్రారంభం కాగా 30న గడువు ముగియనుంది.



భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ భవనం

కొత్త కోర్సులు ఇవే...

ఐటీఐలలో ఈ విద్యా సంవత్సరంలో ఆరు కొత్త కోర్సులు ప్రవేశపెట్టారు. వాటిలో 1.మ్యానుప్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ (కాల పరిమితి- ఏడాది), 2.ఇండస్ట్రీ యల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ (ఏడాది), 3. ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్ (ఏడాది), 4. బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైడ్ మెకానికల్ (రెండేళ్లు), 5. అడ్వాన్స్ సీఎన్‌సీ మేషనింగ్ టెక్నీషియన్ (రెండేళ్లు), 6.మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికిల్ (రెండేళ్లు) ఉన్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు అర్హులు. మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు కల్పించనున్నారు.

భూపాలపల్లిలో సీట్లు ఇలా..

భూపాలపల్లి ఐటీఐలో కొత్త కోర్సుల్లో చేరేందుకు ప్రభు త్వం సీట్లను కేటాయించింది మ్యానుప్యాక్చరింగ్

● మిగతా 8వ పేజీలో...

కాటారంలో రెండో దఫా అడ్మిషన్లు

కాటారం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాటారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)ని ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్)గా అప్‌గ్రేడ్ చేయడంతో అత్యాధునిక సాంకేతిక శిక్షణ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 65 ఐటీఐలను ఏటీసీ లుగా మార్చిన ప్రభుత్వం వాటన్నింటిలో అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చింది. వీటిలో తొలి విడతలో మౌళిక సదుపాయాలున్న 25 ఏటీసీల్లో అడ్మిషన్ల నోటిఫికేషన్ వెలువడింది. కాటారంతోపాటు మిగతా 40 ఐటీఐల్లో రెండో ధపాలో అడ్మిషన్ల ప్రక్రియ మొదలు కానుందని అధికారులు తెలిపారు. డిసెంబరులో ఈ ప్రక్రియ ప్రారంభం కానుందని భావిస్తున్నారు. కాటారం ఏటీసీలో ఏడాది కాలవ్యవధి శిక్షణ ఉండే మ్యానుప్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సులో 40 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాన్యుఫాక్చరింగ్-40, అర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్-20, రెండేళ్ల వ్యవధి శిక్షణ ఉండే బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్)-24, అడ్వాన్స్ సీఎన్‌సీ మేషనింగ్ టెక్నీషియన్-24, మెకానికల్ ఎలక్ట్రికల్ వెహికల్ కోర్సులో 24 సీట్లు అందుబాటులోకి వస్తాయని ప్రిన్సిపాల్ భిక్షపతి తెలిపారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న ఇసుక లారీ

» ఒకరి మృతి.. మరొకరికి గాయాలు



లారీ టైరు కింద రమేష్ మృతదేహం



రమేష్(ఫైల్)

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : రోడ్డు క్రాస్ చేస్తున్న బైక్‌ను ఇసుక లారీ ఢీకొట్టింది. దీంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని బెగ్లూర్ గ్రామం శివారులో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బెగ్లూర్ గ్రామానికి చెందిన దోమల రమేష్(35), ముల్కల లక్ష్మీనారాయణ పొలం పనుల నిమిత్తం బైక్‌పై బయల్దేరారు. గ్రామశివారులోని ఎల్‌అండ్‌టీ రోడ్డును దాటుతున్న సమయంలో అంబట్‌పల్లి నుంచి మహదేవపూర్ వైపు వస్తున్న ఇసుక లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న రమేష్, లక్ష్మీనారాయణ కిందపడిపోయారు. కిందపడి ఉన్న రమేష్‌పైకి లారీ ముందు టైరు ఎక్కడంతో రమేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. లక్ష్మీనారాయణ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. దీంతో లారీ ఆపేసిన డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. సంఘటన స్థలానికి మహదేవపూర్ సీఐ రాంచదర్‌రావు చేరుకుని పరిశీలించారు. మృతుడి బంధువులు ఆందోళనకు సిద్ధమవడంతో వారితో మాట్లాడి శాంతింపజేశారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్ పోలీసుల అదుపులోనే ఉన్నట్లు సమాచారం.

వృద్ధుడిపై పోక్సో కేసు

పన్నెండేళ్ల బాలికపై లైంగికదాడికి యత్నం

మహాముత్తారం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): పన్నెండేళ్ల బాలికపై ఓ వృద్ధుడు లైంగిక దాడికి యత్నించాడు. దీంతో అతడిపై పోక్సో కేసు నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఈనెల 15న ఇంట్లో ఒంటరిగా ఉండగా ఆమె సమీప బంధువు రత్నం రామయ్య (71) లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయగా అతడు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ విషయాన్ని ఆమె తన తల్లిదండ్రులకు చెప్పింది. ఈ నేపథ్యంలో గురువారం వారు పోలీసులను ఆశ్రయించారు. తనపై జరిగిన అఘాయిత్యం బాలిక ఫిర్యాదు చేయగా ఆ వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసి భూపాలపల్లి కోర్టులో హాజరుపర్చామని ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు. దీంతో అతడిని జడ్జి రిమాండ్ విధించారని పేర్కొన్నారు.


ఎండు గంజాయి పట్టివేత

రేగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎండు గంజాయి తరలిస్తున్న వ్యక్తులను మండలంలోని కొత్తపల్లి క్రాస్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. స్కూటీపై 300 గ్రాముల ఎండు గంజాయిని సీలేరు నుంచి కొనుగోలు చేసి హనుమకొండలో విక్రయించడానికి వెళ్తున్న కనకం కల్యాణ్, ముష్క రవితేజను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

కేయూకు రెగ్యులర్ వీసీ?

నేడో, రేపో ఉత్తర్వుల జారీకి అవకాశం

నియామకంపై కొనసాగుతున్న ఉత్కంఠ



వివరాలు 7వ పేజీలో..

పురాతన ఆలయాలను వెలుగులోకి తేవాలి

ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పురాతన ఆలయాలను వెలుగులోకి తీసుకురావాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ములుగు మండలం జాకారం గ్రామశివారులోని శివాలయాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆలయం చుట్టుపక్కల ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని పంచాయతీశాఖ అధికారులను ఆదేశించారు. ఆలయం స్థల హద్దులను గుర్తించి పూర్తి వివరాలను సమర్పించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు పురావస్తు శాఖ అధికారులు ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. ఆయనవెంట సంబంధిత అధికారులు ఉన్నారు.



శివాలయం పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

సమస్యలను పరిష్కరించాలి



విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టిజన్ కార్మికులు

- విద్యార్హతల ఆధారంగా ఆర్టిజన్ల కన్వర్షన్ చేయాలి
- టీవీఏసీ జాక్ డిమాండ్
- లేదంటే జాక్ ఆధ్వర్యంలో సమ్మె
- మహాధర్నాతో దద్దరిల్లిన సీఎండీ కార్యాలయం

6

అట్రాసిటీ కేసులపై తక్షణ చర్యలు చేపట్టాలి

- ఎఫ్ఐఆర్ వెంటనే నమోదు కావాలి
- సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి
- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాంచందర్



సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): అట్రాసిటీ కేసులపై తక్షణ చర్యలు చేపట్టాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. భూపాలపల్లి జిల్లాలో ఆయన గురువారం పర్యటించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి అన్ని శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి లేని పేదలకు భూములు ఇవ్వాలన్నారు. అక్రమాలకు పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రుణాలు పొందిన లబ్ధిదారులకు సకాలంలో సబ్సిడీ మంజూరు చేయాలన్నారు. విడతల వారీగా సబ్సిడీ మంజూరు చేయడం వల్ల లబ్ధిదారులకు ఆర్థికభారం అవుతుందన్నారు. ప్రధాన మంతి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీం ద్వారా ఎక్కువ మందికి లబ్ధి చేకూరేలా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఇండస్ట్రియల్ పార్కులోని కేటాయింపులో ఎస్సీలకు రోస్టర్ పాటించే విధంగా చర్యలు చేపట్టాలనాను. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రధానమంతి ఆవాస్ యోజన పథకం పేదలకు ఇళ్ల మంజూరు చేయాలన్నారు. మరుగుదొడ్లు లేని ఎస్సీ కుటుంబాలను గుర్తించి మంజూరు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకుడు సునీల్ కుమార్‌బాబు, రీసెర్చ్ అధికారి వరప్రసాద్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఎస్‌డీసీగా
కాటారం సబ్ కలెక్టర్



మయాంక్‌సింగ్

కాటారం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్డీసీ)గా కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్‌ను నియమించారు. పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భారీ సాగునీటి రంగంలో భాగమైన చిన్నకాళేశ్వరం ప్రాజెక్టు పరిధి కాటారం డివిజన్‌లోనే ఉండటంతో సబ్ కలెక్టర్‌కు ఎస్డీసీ బాధ్యతలు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియ వేగవంతం కానున్నట్లు పలువురు భావిస్తున్నారు.

ఐటీడీఏలో కుమరంభీం వర్ధంతి



ఐటీడీఏలోని కుమరంభీం విగ్రహానికి పూలమాల వేస్తున్న పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం వర్ధంతిని మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. పీవో చిత్రామిశ్రా, ఆదివాసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలోని కుమరంభీం విగ్రహానికి పీవో చిత్రామిశ్రా పూలమాల వేసి నివాళులర్పించారు. కుమరంభీం ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మైపతి అరుణ్‌కుమార్, పోడెం బాబు, మడే సాయిబాబా, ఎస్‌వో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం

ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య



కంటైనర్ ఆస్పత్రిలో రికార్డులన పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

వాజేడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ములుగు డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య అన్నారు. మండలంలోని ఏడ్జర్లపల్లిలో ఉన్న కంటైనర్ ఆస్పత్రిని ఆయన గురువారం పరిశీలించారు. ఆస్పత్రి రికార్డులను, మందుల నిల్వలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. కంటైనర్ ఆస్పత్రిలో నిత్యం సేవలు అందించాలని సూచించారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా జరిగాయి. కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి సందేశాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈకార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

నేడు క్వార్టర్ల బెటర్‌మెంట్ కౌన్సెలింగ్

కాకతీయఖని, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలో క్వార్టర్స్ బెటర్ మెంట్ కౌన్సెలింగ్‌ను శుక్రవారం నిర్వహించనున్నారు. స్థానిక ఎంవీటీసీ కార్యాలంయంలో ఈ ప్రక్రియ కొనసాగనుంది. 169 క్వార్టర్లను కౌన్సెలింగ్‌లో ఉంచారు. సుమారు 620 మంది కార్మికులు ఇందులో హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 7న ఈ కౌన్సెలింగ్ నిర్వహించనుండగా నిరసన వ్యక్తమైంది. ఖాళీ క్వార్టర్లన్నింటినీ కౌన్సెలింగ్‌లో పెట్టాలంటూ కార్మికులు బహిష్కరించారు. ఈ క్రమంలో ఏరియా సింగరేణి అధికారులు కార్మిక సంఘాల నాయకులతో చర్చించి తిరిగి కౌన్సెలింగ్ నిర్వహించేందుకు పూనుకున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించగా ఏరియాలో ఉన్న 4751 క్వార్టర్ల పూర్తి వివరాలను అధికారులు నోటీసు బోర్డుపై ఉంచాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. దీంతో అది ఇప్పుడు వీలుకాదని సింగరేణి అధికారులు తేల్చిచెప్పారు. దీంతో శుక్రవారం జరగనున్న క్వార్టర్ల కౌన్సెలింగ్‌లో ఏఐటీయూసీ పాల్గొనబోదని గనుల వద్ద ఆ సంఘం పోస్టర్లను ప్రదర్శించింది. సింగరేణి అధికారులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనైనా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెబుతున్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా రవిచందర్



రవిచందర్

ములుగు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బానోత్ రవిచందర్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. 2010లో కాంగ్రెస్ క్రియాశీల సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన రవిచందర్ ములుగు మండలం బండారుపల్లి ఉప సర్పంచ్‌గా సేవలందించారు. యూత్ కాంగ్రెస్ ములుగు మండల అధ్యక్షుడిగా పనిచేశారు. 2020లో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2018-2024 అసెంబ్లీ ఎన్నికల్లో సీతక్క గెలుపు కోసం కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన మంత్రి సీతక్క జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవికి ప్రతిపాదించారు. తనను జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ పదవికి ఎంపిక చేయడంలో సహకరించిన మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్యకు రవిచందర్ కృతజ్ఞతలు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

- 610 కిలోల బెల్లం, 338 లీటర్ల గుడుంబా స్వాధీనం
- 33 మందిపై కేసు నమోదు
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



బెల్లం పానకాన్ని పారబోస్తున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాల్లో, మారుమూల ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజాము నుంచే గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి, గుడుంబా విక్రయిస్తున్న వారి పై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు సాలార్‌తండలో టౌన్ సీఐ గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. జిల్లా 5,840 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి 641 కిలోల నల్లబెల్లం, 338 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇందుకు బాధ్యులైన 33 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారు చేసినా, విక్రయించిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామస్థులకు గుడుంబా వల్ల జరిగే నష్టంపై అవగాహన కల్పించారు. నూతన చట్టాల గూర్చి, సైబర్‌నేరాలు, అన్‌లైన్, ఆర్థిక మోసాలు, బాల్యవివాహాలు, లైంగికదాడుల గూర్చి, కొత్తచట్టాల అమలు చేసే కఠిన శిక్షలపై అవగాహన కల్పించారు. ఈ దాడుల్లో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సుమారు 155 పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 19న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ అధికారి ఎం. మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ హైదరాబాద్‌కు చెందిన కంపెనీలో రాష్ట్రంలో ఎక్కడైనా పనిచేసేందుకు ట్రెయినీ కేంద్ర మేనేజర్ 50 ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు జాబ్ మేళాలో పాల్గొన వచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 19న ములుగు రోడ్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాలకు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 789 33 94393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కేయూ డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫీజు గడువు 28

కేయూ క్యాంపస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ విద్యార్థులందరూ అక్టోబరు 28 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం. తిరుమలదేవిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 50 అపరాధ రుసుంతో నవంబరు 2వ వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం ఉందని పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతర కోర్సుల రెగ్యు లర్, బ్లాక్ లాగ్ విద్యార్థులందరూ ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. ఇతర వివరా లకు కళాశాలలో సంప్రదించాలని వివరించారు.

యువతి అదృశ్యం

డోర్నకల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం హున్యాతండా గ్రామపంచాయతీకి చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు డోర్నకల్ సీఐ రాజేష్ గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. సదరు యువతి ఈనెల 15న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాత్రిపొద్దుపోయేంత వరకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆమె స్నేహితులు, బంధువుల ఇళ్లలో వాకబు చేశారు. ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో బుధవారం రాత్రి యువతి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. యువతి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. మహబూబాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. కళాశాలలో ప్రవేశాలు ఎలా ఉన్నాయి, తరగతుల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు మొదలగు విషయాలను ప్రిన్సిపాల్ బలరాంనాయక్, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ కళాశాల భవనానికి సంబంధించిన భూమి, నిర్మాణానికి నిధులు, పర్నీచర్ వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, మార్నేని రఘు, జెర్రిపోతుల వెంకన్న ఉన్నారు.



కళాశాలలో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

విద్యార్హతల ఆధారంగా
ఆర్టిజన్ల కన్వర్షన్ చేయాలి

- టీవీఏసీ జాక్ డిమాండ్
- మహాధర్నాతో దద్దరిల్లిన సీఎండీ కార్యాలయం



సీఎండీ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేస్తున్న కార్మికులు

హనుమకొండ టౌన్, అక్టోబరు 17 : ఎన్పీడీసీఎల్‌లో ఆర్టిజన్స్‌కు ఉన్న విద్యార్హతల ఆధారంగా పోస్టింగ్ కేటాయించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జాక్ (టీవీఏసీ) చైర్మన్ కె.ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేసిన తర్వాతే డిస్కంలలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని సీఎండీ కార్యాలయం ఎదుట టీవీఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఎన్పీడీసీఎల్‌ని 16 సర్కిళ్లలో ఆర్టిజన్ కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి మహాధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాక్ చైర్మన్ కె. ఈశ్వర్‌రావు మాట్లాడుతూ 2017లో 23,667 మంది కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించగా, 2024 సంవత్సరం వచ్చే సరికి 23,667 మందిలో కొంత మంది రిటైర్డ్ కావడం, మరి కొంత మంది ప్రమాదాలతో మరణించడం ద్వారా ప్రస్తుతం 19,587 మంది ఆర్టిజన్‌లు మాత్రమే మిగిలిపోయారన్నారు. వారందరిని కన్వర్షన్ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్‌లల్లో ఐటీఐ చదివినవారికి జూనియర్ లైన్‌మెన్, డిప్లొమా పూర్తి చేసిన వారికి సబ్ ఇంజనీరింగ్, డిగ్రీ ఆపైన చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్, పది చదవిన వారికి సబార్డినేట్‌గా, ఇంటర్ చదవినవారికి రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దీనిపై ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్కను జాక్ ఆధ్వర్యంలో కలిసి చర్చించగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సమస్య ఇలాగ ఉండగానే మరో 3500 పోస్టులను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేస్తుందని, ముందుగా 19,587 మంది ఆర్టిజన్‌లను కన్వర్షన్ చేసిన తర్వాతనే నియామకాలు చేపట్టాలని లేదంటే జాక్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని మేనేజ్‌మెంట్, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం జాక్‌లోని ముఖ్య నాయకులు సీఎండీ వరుణ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మహాధర్నాకు ముందు ఉమ్మడి ఐదు జిల్లాల నుంచి తరలివచ్చిన ఆర్టిజన్‌లు పబ్లిక్‌గార్డెన్ నుంచి ఎన్పీడీసీఎల్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి కాళోజీ జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్‌కు వచ్చే మార్గంలో కార్పొరేట్ కార్యాలయం ఎదుట సమారు 3 గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాక్ కన్వీనర్ వజీర్, కో- కన్వీనర్ నాగరాజు, కో-చైర్మన్ బి. శంకర్, ఫైనాన్స్ సెక్రెటరీ సదానందం, జాయింట్ సెక్రటరీ చంద్రారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగలు రమేశ్ పాల్గొన్నారు. కాగా, నక్కలగుట్ట నుంచి అంబేద్కర్ వరకు వన్ వే చేసి ఆ మార్గాన్ని సమారు 4 గంటల పాటు బ్లాక్ చేయడం ద్వారా వావాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్ పోటీలకు ఆహ్వానం

వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను (ఫ్లాగ్‌డే) పురస్కరించుకొని వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విద్యార్థినీ, విద్యార్థులు, యువతీ, యువకులకు ఔత్సాహిక ఫొటో గ్రాఫర్లకు ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్‌లకు సంబంధించి రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్టు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. పోలీసు అమర వీరుల ప్రాణా త్యాగాలను స్మరిస్తూ ఈనెల 21 నుంచి 31 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసులు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే ఈ మధ్య కాలంలో తీసిన మూడు ఫొటోలు, తక్కువ నిడివి (మూ డు నిముషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్ర స్థాయి పోటీల కోసం ఈనెల 22వ తేదీలోగా వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్, 10 ఇంటు 8 సైజ్ ఫొటోలను వరంగల్ సీపీ పీఆర్‌వోకు అందజేయాలన్నారు. ఈ పోటీలకు నామినేషన్లు పంపించే ఔత్సాహికులు మూఢ నమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మ తలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాల సేవనం, వాటి అనర్థాలు ఇతర సం దర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2013 అక్టోబరు నుంచి ప్రస్తుత సంవత్సరం అక్టోబరు నెల (ఇప్పటి వరకు) తీసిన మూడు ఫొటోలు, షార్ట్ ఫిల్మ్ మాత్రమే పంపించాల్సి ఉంటుం దన్నారు. మరిన్ని వివరాల కోసం 87126 85050 నెంబర్ ద్వారా పీఆర్‌వోను సంప్రదించాలన్నారు.

బాణసంచా విక్రయ కేంద్రాల అనుమతికి దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తాత్కాలిక బాణసంచా విక్రయాలకు అనుమతి కోసం ఆసక్తి కలిగిన వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా వరంగల్ పోలీసు కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకునే వారు దరఖాస్తుతో పాటు ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేస్తున్నట్లయితే స్థల యజమాని అనుమతి పత్రం, అలాగే ప్రభుత్వ స్థలాల్లో అయితే సంబంధిత ప్రభుత్వ అధికారుల అనుమతి పత్రం, పక్క నిర్మాణాల్లో ఏర్పాటు చేస్తున్నట్లతే వాటి యజమానుల అనుమతితో పాటు పక్క భవనం బ్లూ ప్రింట్, ఎస్‌బీఐ ఆదాలత్ శాఖలో రూ. 800 ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లుగా బ్యాంక్ చాలన్‌తో దరఖాస్తుకు జతచేయాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను అక్టోబరు 23వ తేదీలోపు సమర్పించాలని సీపీ కోరారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులు అనుమతులు జారీ చేస్తారు. ఎవరైనా ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తొర్రూరు డిపోకు అత్యధిక ఆదాయం

వరంగల్ ఆర్టీసీ రీజియన్‌లో ప్రథమ స్థానం

తొర్రూరు, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా తొర్రూరు ఆర్టీసీ డిపోకు అత్యధిక ఆదాయం లభించినట్లు డీఎం పద్మావతి గురువారం తెలి పారు. డిపో నుంచి హైదరాబాద్, వరంగల్, ఖమ్మం వివిధ రూట్‌లలో బస్సులను ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు తిరుగు ప్రయాణంలో రూ. కోటి ఆదాయం వచ్చిందన్నారు. 14వ తేదీ రూ.39 లక్షల 65 వేలు, 15న రూ.32 లక్షలు, 16న రూ.30 లక్షల 31వేల ఆదాయం సమకూరినట్లు వివరించారు. గతేడాదితో పోలిస్తే ఆదాయం అధికంగా పెరిగిందని, ఓఆర్ శాతం కూడా ఎక్కువగా ఉందన్నారు. ఈనెల 14న 148 ఓర్ ఆక్యుపెన్సీతో వరంగల్ రీజియన్ పరిధిలో ప్రథమ స్థానంలో నిలిచామని పద్మావతి తెలిపారు. తొర్రూరు డిపో 1997 లో ఏర్పడగా, ఈనెల 14వ తేదీన అత్యధికంగా రూ.40 లక్షల ఆదాయం రావడం చరిత్ర సృష్టించిందని, వరంగల్ రీజియన్ పరిధిలో తొర్రూరు డిపో 1వ స్థానంలో ఉండగా రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచిందన్నారు. ప్రత్యేక రూట్‌లలో బస్సులను నడిపి ఆదాయాన్ని సమకూర్చకోవడం జరిగిందని, అత్యధిక ఆదాయం సమకూర్చిన సిబ్బందికి అభినందనలు తెలిపారు.

దంపతుల కుల బహిష్కరణ ?

- దశ దినకర్మకు రావొద్దంటూ పాలివాళ్ల అడ్డగింత
- కుటుంబ కలహాలే కారణం ?
- జనగామ జిల్లాలో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి దశ దిన కర్మకు హాజరైన దంపతులను వారి పాలివాళ్లు అడ్డగించి కుల బహిష్కరణచేసిన ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. బాధిత దంపతులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఆయన దశదినకర్మ ఉండడంతో పాలివాళ్లు పిట్టకు పెట్టే కార్యక్రమానికి వెళ్లారు. వాళ్లతోపాటు బాధిత దంపతులు కూడా అక్కడికి వెళ్లారు. అనంతరం నీళ్లలో మునిగే కార్యక్రమంలో భాగంగా పాలివాళ్లతో కలిసి వారు కూడా నీటిలో మునిగేందుకు ఉపక్రమిస్తుండగా 'మీరు ఇక్కడికి రావద్దు, మా వద్దకు రావద్దు, నీళ్లలో మునగవద్దు' అంటూ పాలివాళ్లు అడ్డుకున్నారు. అక్కడి నుంచి గెంటేశారు. దీంతో చేసేది ఏమీలేక దంపతులు రోదిస్తూ గ్రామంలోకి వెళ్లారు. తమను అకారణంగా అవమానపరిచారని, తాము చనిపోతామని రోదించడంతో అక్కడే ఉన్న గ్రామస్థులు వారిని సముదాయించారు. తమను అవమానపరిచిన తమ పాలివాళ్లు ఐదుగురుపైన బుధవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని సీఐ జి.వేణు తెలిపారు. అయితే పాలివాళ్ల కుటుంబాల మధ్య జరుగుతున్న గొడవలే వారి బహిష్కరణకు కూడా కారణమని సమాచారం.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన వీరన్న

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను గురువారం కాం గ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్న మర్యాద పూర్వకంగా కలిశారు. కేసముద్రంకు చెందిన వీరన్న ఇటీవల ఓబీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్‌గా నియామకం కాగా, తాజాగా టీపీసీసీ అధ్యక్షుడిని కలిసి, ధన్యవాదాలు తెలిపారు.

ఆటో డ్రైవర్ల సత్తా చాటుతాం

- త్వరలో హైదరాబాద్‌లో బహిరంగసభ
- ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే తమ సత్తా చాటుతామని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మందా రవికుమార్ హెచ్చరించారు. మహబూబాబాద్ పట్టణంలో గురువారం రాష్ట్ర జేఏసీ సమావేశన్ని నలమాస సాయి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 7.50 లక్షల మంది ఆటోడ్రైవర్లు, యాజమానులున్నారని వారిపై 30 లక్షల మంది కుటుంబసభ్యులు ఆధారపడి ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలుకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం పెట్టడంతో ఆటోల్లో ప్రయాణికులు తగ్గి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

తాము మహాలక్ష్మి పథకానికి వ్యతిరేకం కాదని తమను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తం గా ఆర్థిక ఇబ్బందులతో 60మంది చనిపోయారని, వారికి ఒకొక్కరిరి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి కాకుండా నెలకు రూ.12 వేలు చెల్లించాలని కోరారు. తమ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపకుంటే హైదరాబాద్‌లో లక్షలాది మందితో బహిరంగ సభను నిర్వహిస్తామని చెప్పారు. ఆటో డ్రైవర్లంతా సమిష్టిగా ఉంటూ హక్కుల సాధనకోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సాయిలు, నాయకులు మద్దెల రాజేందర్, నీలారపు రవి, వివిధ జిల్లాల అధ్యక్షులు రేణుకుంట్ల సురేష్, జగదీష్‌బాబు, బండి వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద రవికుమార్

త్వరలో తండ్రి రిటైర్మెంట్.. తాజాగా కూతురికి పోస్టింగ్



నియామకపత్రాన్ని అందుకుంటున్న దివ్యవాణి, పక్కన తండ్రి అంజయ్య

రాయపర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మరికొద్ది రోజుల్లో ఆ ఉపాధ్యాయుడు రిటైర్ అవబోతుండగా.. ఇటీవలి నియామకాల్లో ఆయన కూతురు టీచర్‌గా కొలువు సాధించారు. అంతే కాదు ఆయన పనిచేస్తున్న మండలంలోనే ఆమె కూడా జాయిన్ అవడం అరుదైన సంఘటన. దీనికి సంబంధించిన వివరాలివీ. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన పున్నం అంజయ్య 22ఏళ్లుగా ఇదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన ఈ నెలాఖరున పదవీవిరమణ పొందనున్నారు. ఈ క్రమంలో ఆయన కూతురు దివ్యవాణి ఇటీవలి డీఎస్సీ పోస్టింగ్‌లో కొలువు సాధించి రాయపర్తి మండలంలోని గన్నారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా నియమితులయ్యారు. దీంతో ఆ తండ్రీకూతుళ్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గురువారం దివ్యవాణి ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో నోముల రంగయ్యను కలిసి తన అపాయింట్ మెంట్ పత్రాన్ని అందజేయగా ఆమె వెంట తండ్రి అంజయ్య కూడా ఉన్నారు. ఈ క్రమంలో తామిద్దరం పనిచేసేది వేర్వేరు పాఠశాలల్లోనే అయినా ఈ నెలాఖరున తన రిటైర్మెంట్ ఉండ గా.. తన ఉపాధ్యాయ వారసురాలిగా దివ్యవాణి అదే మండలంలో విధుల్లో చేరడం ఆనందంగా ఉందని అంజయ్య మురిసి పోయా రు. తోటి ఉపాధ్యాయులు, అధికారులు కూడా అంజయ్య, దివ్యవాణిలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్మీ పంప్‌హౌస్ విద్యుత్ బకాయి రూ. 523.84 కోట్లు

మహదేవపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని మేడిగడ్డ బ్యారేజీ లక్ష్మీ పంప్‌హౌస్ విద్యుత్ బకాయి రూ. 523 కోట్ల 84 లక్షల 676 పేరుకుపోయింది. 2019 జూన్ 21న ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 163 టీఎంసీల నీళ్లను దిగువకు ఎత్తిపోశారు. పంప్‌హౌస్ ప్రారంభం నుంచి ఈఏడాది ఆగస్టు వరకు విద్యుత్ బిల్లు మొత్తం రూ.833 కోట్లు పేరుకుపోగా అందులో రూ. 320 కోట్లు చెల్లించారు. ఇంకా 513 కోట్లు చెల్లించాల్సి ఉండగా సెప్టెంబరు బిల్లు రూ.10.84 కోట్లు వచ్చింది. ఇలా విద్యుత్ శాఖకు ఇంకా రూ. 523.84 కట్టాల్సి ఉందని సంబంధత అధికారులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తిమ్మంపేట విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని తిమ్మంపేట విద్యార్థులు ఎంపికయ్యారు. జనగామలో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తిమ్మంపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన బుల్లె స్పందన, పెండ్లి నిఖిత, లకావత్ దీపిక, మాచర్ల రిషిత (9వ తరగతి), భూక్య రాణి (8వ తరగతి) పాల్గొని అత్యుత్తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హైస్కూల్ హెచ్‌ఎం షారోన్ గురువారం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు వరంగల్‌లో జరుగుతాయన్నారు. ఎంపికైన విద్యార్థులను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి భగత్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యా యుల తో పాటు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ భాగ్యమ్మ, పాఠశాల దాత ప్రవీణ్‌రెడ్డి అభినందించారు.

మహబూబాబాద్ జిల్లాలో 111.2 మి.మీ వర్షపాతం

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో బుధవారం నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు 111.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బయ్యారంలో 1.4, డోర్నకల్‌లో 1.0, కురవిలో 8.2, మహబూబాబాద్‌లో 7.2, గూడూరులో 8.2, కేసముద్రంలో 13.6, నెల్లికుదురులో 16.2, నర్సింహులపేటలో 5.4, చిన్నగూడూరులో 6.4, మరిపెడలో 3.6, తొర్రూరులో 21.6, పెద్దవంగరలో 18.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 7.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రైల్వే సొరంగ మార్గంలో లీకేజీలు !

- స్లాబ్ నుంచి నీరు లీకై పట్టాలపైకి
- అప్రమత్తం కాకుంటే ఇబ్బందే

కాజీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాజీపేట - హసన్‌పర్తి రైల్వేస్టేషన్ల మధ్య కోమటిపల్లి సమీపంలో నిర్మించిన రైల్వే సొరంగమార్గం ప్రారంభమై నెలరోజులైనా గడవకముందే అప్పుడే లీకేజీలు మొదలయ్యాయి. ఈ మధ్య కురిసిన చిన్నపాటి వర్షానికే నీరు లీకై రైల్వే ట్రాక్‌లపై పడటంతో రైల్వే ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. దక్షిణ మధ్య రైల్వేలోనే మొదటసారిగా సుమారు రూ. 30 కోట్లతో రైల్వే శాఖ ఓ చాలెంజింగ్‌గా సొరంగ మార్గం నిర్మించిన సంగతి తెలిసిందే. 350 మీటర్ల మేర నిర్మించిన ఈ సొరంగమార్గంపై నాలుగు పీట్ల స్లాబ్ దానిపై మట్టి, కంకర, పైన పట్టాలపై ట్రాక్ అనుసంధానికి ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు, ఇన్ని మరమ్మతు చేసి నిర్మించిన స్లాబ్‌నుంచి చిన్న వర్షానికే లీకై నీరు కిందివరకు రావడంపై విమర్శలు వస్తున్నాయి. ఒక వేళ భారీ వర్షాలు వరదలు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ సొరంగ మార్గం ప్రత్యేకత ఏంటంటే ఏక కాలంలో పైనుంచి, కిందనుంచి రైళ్ల రాకపోకలు సాగుతుంటాయి. ఇంత ప్రాధాన్యం కలిగిన సొరంగ మార్గాన్ని రైల్వే అధికారులు అప్రమత్తమై ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



సొరంగమార్గంలో లీకైన స్లాబు



స్లాబు నుంచి నీరు కారి తడిసిన పట్టాలు



చెత్తా చెదారంతో నిండిపోయిన మధ్యకోటలోని కోడికూత బావి



ముళ్ల పొదలతో నిండి ఉన్న సింగారపు బావి

కాలగర్భంలో కలుస్తున్నాయ్..

అధ్వానస్థితిలో కాకతీయుల కాలం నాటి బావులు

- చెత్తా చెదారంతో నింపేస్తున్న స్థానికులు
- పురాతన కట్టడాల రక్షణ మరిచిన అధికారులు

ఖిలావరంగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఓరుగల్లు అంటేనే కాకతీయుల నాటి కళా సంపదకు నిలయం. నాటి కాలంలో నిర్మించిన ఎన్నో ఆలయాలు, సరస్సులు, బావులు పర్యావరణ, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. క్రీ.శ 11వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు దక్షిణ దేశాన్ని పరిపాలించిన కాకతీయ రాజులు.. తమకు రక్షణగా ఉండేందుకు మట్టి, రాతికోటలు, దేవాలయాలు, చెరువులు, బావులను తవ్వించారు. ఆ సమయంలో వరంగల్ ఉమ్మడి జిల్లాతో పాటు వరంగల్ కోటలో అనేక బావులను తవ్వించారు. వాటిలో రామప్ప, లక్నవరం, పాకాల, ములుగు, ఘణపురం, భద్రకాళి, గుండు చెరువులతో పాటు రాతి, మట్టికోటల చుట్టూ కందకాలను తవ్వి వాటిలో నీటిని నింపేవారు. అలాగే ఖిలావరంగల్ దిగుడు, మెట్లు, సింగారపు, కోనేరు తదితర బావులను నిర్మించారు. వాటిలో సంవత్సరం అంతా నీరు ఉండేదని పెద్దలు చెబుతున్నారు. ఇక రాజులు స్నానాలు చేయడానికి ఖిలావరంగల్ మధ్యకోటలో సింగారపు బావి, శివనగర్‌లో మెట్లు, కోడికూత, సవతులు, అక్కాచెల్లెళ్ల, గడియారం, అవుసుల, ఈసన్న, తలుపుల, తదితర బావులున్నాయి. ప్రస్తుతం ఖిలావరంగల్ మూడు కోటల్లో జనాభా విస్తరణ కావడంతో జనావాసాల మధ్యలో ఉన్న కోడికూత, ఈసన్న, తలుపుల, అవుసుల బావులను పట్టించుకునే వారు లేకపోవడంతో స్థానికులు ఇష్టారీతిన చెత్తాచెదారం వేస్తున్నారు. దాంతో పాటు వాటిలో, వాటి చుట్టూ చెట్లు, ముళ్లపొదలు పెరిగి అడవులను తలపిస్తున్నాయి. పర్యాటకులు అందులోకి వెళ్లి బావులను చూసేందుకు భయపడే పరిస్థితి ఉంది. ఇలా పురాతన కాలం నాటి బావులు కాలగర్భంలో కలిసి, ఆనవాళ్లు లేకుండా పోవడం పట్ల పర్యావరణ, పర్యాటక ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురాతన కాలంనాటి చెరువులు, బావులను పరిరక్షించి ముందుతరాలకు అందించాల్సిన అవసరం ఉందని పర్యాటక, చరిత్రకారులు, పెద్దలు కోరుతున్నారు.



ఖిలావరంగల్ కాపువాడలో ఉన్న ఈసన్నబావి చెత్తతో నిండిపోయిన దృశ్యం

సూచిక బోర్డులు, దారులను ఏర్పాటు చేయాలి



తోట రాజు, ఖిలావరంగల్

ఖిలావరంగల్ ప్రాంతానికి వచ్చే దారిలో సూచికబోర్డులను ఏర్పాటు చేసి, చారిత్రక ప్రసిద్ధి చెందిన దేవాలయా లు, కట్టడాలు, బావులకు దారులను నిర్మించాలి. దీంతో దేశ, విదేశాలతో పాటు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది.

చారిత్రక కట్టడాలు, బావులను పరిరక్షించాలి



ఎండీ. సలీంఖాన్, మధ్యకోట

పర్యాటక ప్రదేశాలకు కేంద్రమైన కాకతీయుల కట్టడాలు, ఆలయాలు, చెరువులు, బావులను రక్షించి ముందు తరాలకు అందించాలి. లేదంటే వేల సంవత్సరాల చరిత్ర కలిగిన అద్భుత కట్టడాలు, చెరువులు, బావులు కాలగర్భంలో కలిసి పోతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పురాతన కట్టడాలను పరిరక్షించేలా మరిన్ని పటిష్ఠ చర్యలు తీసుకోవాలి.

- వర్షాలు, గాలిదుమారాలతో తగ్గిన దిగుమతి
- రకం, సైజును బట్టి ఒక్కో కాయ రూ.35కి విక్రయం
- ఉమ్మడి జిల్లాకు తమిళనాడు నుంచి వస్తున్న సరుకు
- కొబ్బరి బొండాల ధరలూ పెరిగిన వైనం


కొండెక్కిన కొబ్బరి





వరంగల్ చౌరస్తా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పండుగలు, శుభ, అశుభకార్యాలు సందర్భం ఏదైనా.. ఆలయాల సందర్శనకు వెళ్లినా.. ప్రతీ ఒక్కరు ఉపయోగించేది కొబ్బరి కాయ. అసలు ఈ కొబ్బరికాయ లేనిదే ఏ కార్యక్రమం కూడా పరిపూర్ణత ఉండదని అందరి నమ్మకం. అలాంటి కొబ్బరి కాయ ధరలు కొండెక్కాయి. ఏకంగా 50 శాతం నుంచి 100శాతం వరకు ధరలు పెరిగాయి. ఇందుకు ఇటీవలి భారీ వర్షాలు, గాలిదుమారాలే కారణమని చెబుతున్నారు. భారీ వర్షాలతో ఆంధ్రా ప్రాంతంలోని భీమవరం, పాలకొల్లు ఇతర ప్రాంతాల్లో పంటకు తీవ్ర నష్టం జరుగడంతో కొబ్బరికాయల ఉత్పత్తి తగ్గింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాపారులు తమిళనాడు నుంచి కాయను దిగుమతి చేసుకుంటున్నారు. తెలంగాణలోనే హైదరాబాద్ తర్వాత అతి పెద్ద వ్యాపార కేంద్రంగా ఉన్న వరంగల్ బీట్ బజార్ మార్కెట్‌కు గతంలో ఏపీ నుంచి నిత్యం 8 లారీల్లో దాదాపు 2లక్షల కొబ్బరికాయలు వచ్చేవి. అందులో నిత్యం దాదాపు 80 శాతం అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం ఏపీ నుంచి దిగుమతి సగానికి తగ్గింది. ఇక వారం రోజుల నుంచి తమిళనాడులో కూడా భారీ వర్షాలు వస్తుండటంతో కొబ్బరి పంటకు నష్టం వాటిల్లి అనుకున్నంత సరుకు ఇక్కడికి రావడం లేదు. దీంతో రోజుకు రూ.30లక్షల మేర జరిగే వ్యాపారం కాస్తా కుంటుపడింది. రెండు నెలల క్రితం నాలుగు రకాల సైజుల్లో ఉండే కొబ్బరికాయలకు ఒక్కొక్కటి రూ.10 నుంచి రూ.20 వరకు విక్రయించే వారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆ ధరలు రూ.15 నుంచి రూ.35కు పెరిగాయి. మరోవైపు కొబ్బరిబొండాల ధరలు కూడా అంతే ఉన్నాయి. గతంలో సైజు, రకాన్ని బట్టి ఒక్కో బొండాం రూ.15 నుంచి రూ.20 వరకు విక్రయించే వారు. కానీ ఇప్పుడు ఏర్పడిన కొరత కారణంగా రూ.40వరకు అమ్ముతున్నారు.

శ్రమైక జీవన సౌందర్యం.. నిండు చంద్రుడి సోయగం..



శ్రమైక జీవన సౌందర్యానికి.. నిండు పౌర్ణమి చంద్రుడి సోయగం తోడైతే.. ఆ సుందర దృశ్యం కళ్లముందు ఆవిష్కృతమైతే పరవశించని మనసుంటుందా. చూడముచ్చటైన ఆ ప్రకృతి గీసిన సహజ రూపాన్ని స్వీకరించని, ఆస్వాదించని హృదయం ఉంటుందా. పున్నమి వేళ.. సంధ్యాసమయాన.. చంద్రకాంతి వెదజల్లుతున్న వేళ ఇదిగో ఇలా ఓ గీత కార్మికుడు కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతూ అద్భుత దృశ్యానికి ఆయువు పోశాడు. ఈ అపురూప చిత్రం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం గట్టుకిందిపల్లి వద్ద ఆవిష్కృతమైంది.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ



గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

వైభవంగా గోదావరి హారతి

మహదేవపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరంలో గోదావరి హారతి కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. కాళేశ్వర ముక్తీశ్వర దేవస్థానం నుంచి అర్చకులు, ఆలయ నిర్వాహకులు మంగళవాయిద్యాలతో గోదావరి ఒడ్డుకు చేరుకొని హారతి ఇచ్చారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, మాజీ ధర్మకర్త శ్యాంసుందర్, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, గ్రామస్థులు, భక్తులు, అన్నమయ్య సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. దేవాదాయశాఖ ఆదేశాలమేరకు ప్రతి పౌర్ణమికీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

రంగనాథుడిని తాకిన సూర్య కిరణాలు



రంగనాథ స్వామిపై పడిన సూర్యకిరణాలు

కాశిబుగ్గ, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గలోని రంగనాథ ఆలయంలో స్వామిపై గురువారం సూర్యకిరణాలు పడ్డాయి. ఉదయం 6.30గంటల ప్రాంతంలో సూర్యకిరణాలు పడ్డ విషయం స్థానికులకు తెలియడంతో భక్తుల రద్దీ పెరిగింది. దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూరి సురేష్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు, శ్రీనివాస్, కవిత, ప్రకాష్‌రెడ్డి, ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.



వరంగల్ 27వ డివిజన్‌లో పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్, భక్తులు

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

గిర్మాజిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరం 27వ డివిజన్‌లోని గోవిందరాజుల గుట్ట ప్రాంతంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ముదిరాజ్‌లు బోనాల పండుగ జరుపుకున్నారు. మహిళలు తలపై బోనాలు పెట్టుకుని పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు సమర్పించుకున్నారు. కుటుంబ సభ్యులను చల్లంగా చూడాలంటూ తల్లిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సునీల్ కుమార్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్, అర్బన్ అధ్యక్షుడు బి.స్వామి, ముదిరాజ్ నాయకులు ఆదినారాయణ, మహేష్, చందర్, నర్ర శివ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రికెట్ జట్టు

కాశిబుగ్గ, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాల క్రికెట్ జట్ల ఎంపిక గురువారం ముగిసింది. రెండు రోజులుగా సీకేఎం కళాశాల మైదానంలో కార్యక్రమం నిర్వహించారు. వరంగల్, హనుమకొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల జట్లను ఎంపిక చేశారు. ఈ జట్లు ఈనెల 20 నుంచి 23 వరకు జరిగే అండర్- 23 లీగ్ కమ్ నాకౌట్ పోటీల్లో పాల్గొననున్నట్లు వరంగల్ ఉమ్మడి జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో రాణించిన క్రీడాకారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ కేంద్రంగా నవంబర్ 4నుంచి 6వరకు జరిగే అండర్-23 అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు ఎంపికవుతారని వివరించారు.

కేయూకు రెగ్యులర్ వీసీ?

- నేడో, రేపో ఉత్తర్వుల జారీకి అవకాశం
- నియామకంపై కొనసాగుతున్న ఉత్కంఠ

కేయూ క్యాంపస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీకి ఈసారి రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్ నియామకం జరగనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇటీవలి వరకు కేయూ ఇన్‌చార్జ్ వీసీగా విధులు నిర్వహించిన ఐఏఎస్ అధికారి వాకాటి కరుణ ఏపీకి వెళ్లిపోవడంతో కేయూ వీసీ పోస్టుకు ఖాళీ ఏర్పడింది. అయితే కేయూ వీసీ పోస్టులోకి రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా మరొకరిని నియామిస్తారని శుక్రవారం రాత్రి వరకు వర్సిటీ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూశాయి. కానీ చివరి నిమిషంలో విద్యాశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం నేడో, రేపో కాకతీయ యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమిస్తామని, ఇంతలో ఇన్‌చార్జ్ వీసీగా మరొకరిని నియమించాల్సిన అవసరం లేదని అన్నట్టు సమాచారం. అదే సమయంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డికి కూడా రాష్ట్ర ప్రభుత్వం నేడో, రేపో కచ్చితంగా రెగ్యులర్ వీసీని నియమిస్తుందని, ఇన్‌చార్జ్ వీసీ అవసరం లేదని, రెగ్యులర్ వీసీ వచ్చే వరకు తాత్కాలికంగా చూసుకోవాలని చెప్పినట్టు తెలుస్తోంది. ఈ లోపు ఏదైనా అత్యవసరమైన సమాచారం ఉంటే తన దృష్టికి తేవాలని ఆదేశాలిచ్చారని సమాచారం. ఏదేమైనా వర్సిటీ చరిత్రలో వీసీ లేకపోవడం చర్చనీయంగా మారింది.

ఆడించే వారేరీ?

- క్రీడలకు నోచుకోని ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు
- 50 జూనియర్ కళాశాలల్లో ఒక్కరూ లేని వైనం
- ఉమ్మడి జిల్లాలో 17 డిగ్రీ కాలేజీల్లో నలుగురే పీడీలు
- అధ్యాపకులతోనే నామమాత్రంగా ఆటల నిర్వహణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుల్లోనే కాదు.. క్రీడారంగంలోనూ రాణించాలని పాలకులు తమ ప్రసంగాల్లో ఊదరగొడుతుంటారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం సొంతమవుతుందంటారు. అలాంటి క్రీడల నిర్వహణకు, క్రీడా రంగం అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నారు. కానీ అది ఆచరణలో మాత్రం అమలవుతున్నట్టు కనిపించడం లేదు. అందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు ఆటలు ఆడించే వారే కనపడకపోవడమే నిదర్శనం. మొత్తం 17 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలుండగా, మూడు కళాశాలల్లో మాత్రమే ఫిజికల్ డైరెక్టర్‌లున్నారు. కాగా, కొన్ని కళాశాలల్లో పోస్టులే మంజూరు కాకపోవటంతో పాటు మొత్తంగా 14 కాలేజీల్లో ఫిజికల్ డైరెక్టర్లు లేకపోవటం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో 50 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, ఒక్క కళాశాలలో కూడ ఫిజికల్ డైరెక్టర్లు లేరంటే అతిశయోక్తి కాదేమో. అన్ని కళాశాలలకు నామ్‌కే వాస్తేగా అధ్యాపకులతోనే క్రీడలు నిర్వహిస్తున్నారు. జిల్లాల ఏర్పాటు తర్వాతనైనా ఉన్నతస్థాయి అధికారులు దృష్టి సారిస్తారనుకుంటే కొత్త జిల్లాలు ఏర్పడి కూడా రెండేళ్ల పూర్తికావస్తున్నా ఒక్క కళాశాలకు పీడీని నియమించలేక పోయారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని డిగ్రీ, జూనియర్ కళాశాలకు ఇచ్చిన క్రీడా సామాగ్రి వినియోగంలో లేక మూలకు పడింది.

క్రీడా మైదానాలు సరే.. ఆడించే వారేరీ?

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో కొత్తగా ఏర్పడిన మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాల పరిధిలో 17 డిగ్రీ, 50 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం ప్రతీ కళాశాలకు రూ.లక్షల విలువగల క్రీడావస్తువులను సరఫరా చేసినప్పటికి ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)లను నియమించలేదు. పాఠశాల స్థాయిలో క్రీడారంగంలో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో రాణించి పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్, డిగ్రీ విద్య కోసం కళాశాలల్లో చేరిన విద్యార్థులకు కళాశాలల్లో క్రీడలు నిర్వహించకపోవటంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. రాష్ట్రప్రభుత్వం విద్యాబోధనతో పాటు క్రీడారంగాన్ని ప్రోత్సహించేందుకు కళాశాల కీలకదశ అని చెప్పుకోవచ్చు. క్రీడాకారులు ఉన్నతచదువులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో స్పోర్ట్స్ కోటాలో సీట్లు సాధించుకునే అవకాశం ఉంటుంది. కళాశాలల్లో క్రీడల్లో తర్ఫీదు నిచ్చే పీడీలు లేకపోవడంతో విద్యకే పరిమితం కావాల్సి వస్తోంది. క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా అవకాశం లేకవారి భవిష్యత్ చేజార్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. క్రీడలకు పుట్టినిల్లు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలాంటి పరిస్థితి నెలకొంటే ఇక మారుమూల ప్రాంత విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతోంది. ఇప్పటికైనా పీడీలను నియమించి క్రీడాకారులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత పాలకులు, అధికారులపై ఉంది. ఆదిశగా ప్రయత్నాలు చేయాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.



మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానం

కనిపించని క్రీడా వస్తువులు

ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు క్రీడల్లో ఆసక్తి కనబరుస్తున్నా గత ఎనిమిదేళ్లుగా క్రీడా వస్తువులు అందడంలేదు. వాలీబాల్, బాస్కెట్ బాల్, క్యారంబోర్డు, క్రికెట్ కిట్, చెస్, ఫుట్‌బాల్, షటిల్‌బ్యాట్లు, షాట్‌పుట్, జావలిన్ త్రో, టెన్నికాయిట్, డిస్కస్‌త్రో, టెన్నిస్‌బాల్,స్కిప్పింగ్ క్రీడల్లో విద్యార్థులు రాణిస్తున్నా ఆటలు ఆడించే వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవడం దేవుడెరుగు. క్రీడలపై ఆసక్తి ఉన్న క్రీడాకారులు స్వతహాగా ఆడేందుకు కూడా క్రీడా కిట్లు అందుబాటులో లేకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు.

సొంత ఖర్చులతోనే వర్సిటీ స్థాయి పోటీలకు..

యూనివర్సిటీ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లే క్రీడాకారులు స్వంత డబ్బులతోనే వెళ్లి పోటీల్లో పాల్గొనాల్సి వస్తుందని వాపోతున్నారు. గతంలో క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లే క్రీడాకారులను కళాశాలలకు వచ్చే నిధుల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు తీసుకువెళ్లేవారు. అంతే కాకుండా క్రీడా డ్రెస్‌లను కూడా కళాశాలల నుంచే సమకూర్చేవారు. కానీ, అవేమి లేకపోవడంతో విద్యార్థులు సైతం ఆసక్తి చూపడంలేదనే విమర్శలు లేకపోలేదు.

క్రీడలకు నిధులు కేటాయించాలి



బి.అజయ్, మాజీ జాతీయ క్రీడాకారుడు, మహబూబాబాద్

క్రీడలకు నిధులు కేటాయించాలి. స్వరాష్ట్రంలోనైనా క్రీడలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి క్రీడాకారులను ప్రోత్సహించాలి. మానుకోట డివిజన్ క్రీడా కారులకు పుట్టినిల్లుగా పేరుగాంచింది. ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థులను క్రీడారంగంలో రాణించే విధంగా చూడాలి.

వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలి



బొద్దుపెల్లి ఉపేందర్, మాజీ జాతీయ ఖోఖో క్రీడాకారుడు, మహబూబాబాద్

క్రీడాకారులకు తర్ఫీదు నిచ్చేందుకు పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలి. పాఠశాలలు, కళాశాలల్లో సాయంత్రం వేళల్లో క్రీడలకు సమయం కేటాయించాలి. వ్యాయామ ఉపాధ్యా యులులేక క్రీడలు నిర్వహించకపోవటంతో పాటు క్రమశిక్షణ కొరవడుతుంది. ప్రభుత్వం వ్యాయామ ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టాలి.

జిల్లాల వారీగా జూనియర్ కళాశాలలు, పీడీలు

జిల్లా	కళాశాలలు	పీడీల సంఖ్య
వరంగల్	11	0
హనుమకొండ	09	0
మహబూబాబాద్	10	0
జయశంకర్ భూపాలపల్లి	05	0
ములుగు	08	0
జనగామ	07	0
మొత్తం	50	00

జిల్లాల వారీగా డిగ్రీ కళాశాలలు, ప్రస్తుతం ఉన్న పీడీలు

జిల్లా	కళాశాలలు	పీడీల సంఖ్య
వరంగల్	05	01
హనుమకొండ	02	01
మహబూబాబాద్	05	0
జయశంకర్ భూపాలపల్లి	02	0
జనగామ	01	01
ములుగు	02	01
మొత్తం	17	04

కుమరంభీంకు ఘన నివాళి

ఏటూరునాగారం రూరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో కుమరంభీం వర్ధంతిని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్, ఆదివాసీ సేనా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడే సాయిబాబా హాజరయ్యారు. ఐటీడీఏ ప్రాంగణంలోని కుమరంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జోడేఘాట్‌లో ఆదివాసీ హక్కుల సాధన కోసం కుమరంభీం పోరాటాలు చేసి తన రక్తాన్ని షెడ్యూల్ ప్రాంతాల్లో ప్రత్యేక స్వయం ప్రతిపత్తి హక్కులను సాధించారన్నారు. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారమే ఐటీడీఏ పరిధిలోని 29శాఖలకు ప్రత్యేక జీవోలున్నాయని, వీటి ప్రకారం ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసీ బిడ్డలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు అమలు కావాల్సి ఉండగా ప్రభుత్వాలు వీటిని పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొర్రవెల్లి గణేష్, సురేష్, ముద్దబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

● ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు అండగా నిలిచిన కొమరంభీం ఆశయాలను సాధిస్తామని ఆదివాసీ ఉద్యోగులు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో కుమరంభీం వర్ధంతి కార్యక్రమం జరగగా ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో అడవిపై హక్కు ఆదివాసీలకే ఉందని కానీ, ఆ హక్కులను ప్రభుత్వాలు తుంగలో తొక్కి న్యాయంగా రావాల్సిన పోడుపట్టాలను కూడా ఇవ్వకుండా ఆదివాసీలను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాజ్యాంగబద్ధంగా హక్కులను సాధించేవరకు ఆదివాసీ వ్యతిరేకశక్తులపై పోరాడి తీరుతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య, ఆదివాసీ సంఘాల నాయకులు పులుసం నాగేశ్వర్‌రావు, మంకిడి రవి, ముంజాల భిక్షపతి, అన్నవరం రవికాంత్, ఈక కుమారస్వామి, సోలం వెంకటేశ్వర్లు, దబ్బగట్ల నారాయణ, వజ్జ నర్సయ్య, అల్లెం భాస్కర్, కొత్త సురేందర్, లక్కి



ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో కుమరంభీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

అనిల్‌కుమార్, హట్కర్ సమ్మయ్య, పోరిక సునీల్, గుల్లగట్టు సంజీవ, ఫాల్తియా సారయ్య, వజ్జ రాజు, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

గట్టమ్మతల్లి దేవాలయం ఆవరణలో..

ములుగులోని గట్టమ్మతల్లి దేవాలయం ఆవరణలో ఆదివాసీ నాయకపోడ్ ఆధ్వర్యంలో కుమరంభీం వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆదివాసీ నాయకపోడ్ జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ కుమరంభీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జల్, జంగిల్, జమీన్ నినాదాలతో ఆదివాసీలను ఏకంచేసి స్వయంపాలన కోసం పోరాడిన యోధుడు కొమరంభీం అని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను సక్రమంగా నిర్వర్తిస్తే అభివృద్ధిలో ఆదివాసీలు ముందుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మంకిడి రవి, నాయకులు అన్నవరం రవికాంత్, నరేష్, కొత్త సదయ్య, లక్ష్మయ్య, అరిగెల సమ్మయ్య, ఆకుల మొగిలి, రాజు, రఘు, చిర్రా ముఖేష్, పాల్గొన్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఆదివాసీ వీరుడు కుమరంభీం 84 వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కుమరంభీం చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ లాలు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కుమరంభీం సమాజం కోసం చేసిన పోరాటాలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్



కాటారంలో గిరిజనల గురుకులంలో కుమరం భీం వర్ధంతి

రాజేందర్, మాధవి, డిప్యూటీ వార్డెన్ శ్రీనివాస్, అధ్యాపకులు వెంకటయ్య, రాజు, సమ్మక్క, హరిభూషణ్, రామకృష్ణ, చారి, పీడీ మహేందర్, పీఈటీ మంథెన శ్రీనివాస్, కోచ్ వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● మంగపేట (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివాసీ ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కుమరంభీం 84వ వర్ధంతిని నిర్వహించారు. జేఏసీ నాయకులు కొమరంభీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జల్, జంగిల్, జమీన్ నినాదంతో ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన యోధుడు కుమరంభీం అని పలువురు నాయకులు కొనియాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, పెసా మొబిలైజర్లు తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కుమరంభీం వర్ధంతిని ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం జరిగాయి. ఈసందర్భంగా పలువురు నాయకులు కుమరంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జల్, జంగిల్, జమీన్ నినాదంతో ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన వీరుడు కుమరంభీం అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు పూనెం రాంచందర్, పర్శిక సతీష్, చింత సోమరాజు, తాటి రాంబాబు, కణితి వెంకటకృష్ణ, జెజ్జరి నారాయణమ్మ, గొంది రమాదేవి, నర్సింహారావు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో కొనసాగుతున్న వలంటీర్ల శిక్షణ



రామప్ప దేవాలయం ఆవరణలో వలంటీర్లు



కళాకారుల పేరిణి నృత్యం

వెంకటాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామప్ప దేవాలయంలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల శిక్షణ కొనసాగుతోంది. ఇందులో భాగంగా పురాతన స్మారక నిర్మాణ కట్టడాల కోసం పదార్థాల ఎంపిక అనే అంశంపై మూడోరోజు గురువారం ప్రొఫెసర్ దేవప్రతాప్ వలంటీర్లకు అవగాహన కల్పించారు. వారసత్వ నిర్మాణాల డాక్యుమెంటేషన్ గురించి ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ అధికారి కృష్ణచైతన్య వివరించారు. అనంతరం రామప్పపై వలంటీర్లకు పరిశోధన పత్రాలను సమర్పించారు. సాయంత్రం రంజిత్ బృందం ఆధ్వర్యంలో పేరిణి నృత్యాన్ని కళాకారులు ప్రదర్శించారు. ఈప్రదర్శనలో శిష్యులు తోడెంగ సంతోష్, తోడసం గురుదేవ్, మార్కాల లోహిత్, రేగుల చందు, పల్నాటి శ్రీజ, బండారి తేజస్విని, పిడుసోజు సమీక్ష, జంటి రిత్విక పాల్గొన్నారు.

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ విస్తృత పర్యటన

మంగపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి మండలంలో గురువారం పర్యటించారు. ముందుగా ఆమె నర్సింహ సాగర్ గ్రామానికి చెందిన పార్టీ మండల యూత్ నాయకుడు గౌని రమేష్ నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మల్లూరు గ్రామ పరిధిలోని మామిడి గూడెంలో వివాహ రిసెప్షన్‌కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కొత్తమ ల్లూరు గ్రామంలో మండల యూత్ నాయకుడు గుండారపు రమేష్ తల్లి నాగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తిమ్మం పేటలో బీఆర్ఎస్ ఎస్సీసెల్ మాజీ మండల అధ్యక్షుడు తోలెం నర్సింహరావు తల్లి ముత్తమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు గుండేటి రాజు, తుమ్మ మల్లారెడ్డి, కాడబోయిన నరేందర్, నూతలకంటి ముకుందం, చిట్టిమల్ల సమ్మయ్య, చల్లగురుగుల తిరుపతి, కర్రి శ్యాంబాబు, ఉడుగుల శ్రీనివాస్, యగ్గడి అర్జున్, పొదెం రాంబాబు, మునిగాల సాంబులు, ఈసం రామ్మూర్తి ఉన్నారు.



కొత్తమల్లూరులో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాగజ్యోతి

దర్గాలో ఘనంగా ఉర్సు



:జెండా వద్ద మొక్కులు చెల్లిస్తున్న గ్రామస్థులు

కాటారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాంపల్లి, శంకరంపల్లి సరిహద్దుల్లోని దర్గాలో గురువారం హజ్రత్ దస్తగీర్ గౌసె ఆజం ఉర్సు ఘనంగా సాగింది. గుమ్మావలీ బాబా, పిర్‌పాదే సాహెబ్, గౌసె ఆజం బాబా దర్గాల వద్ద ఉత్సవాలు సందడిగా సాగాయి. పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఈ ఉత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకొని మతసామరస్యాన్ని చాటుకున్నారు. తాము కోరిన కోర్కెలు తీరడంతో పలువురు కానుకలు సమర్పించుకున్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన వారు తమ బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి విందు వినోదాలతో గడిపారు. ఈ కార్యక్రమంలో శంకరంపల్లి మాజీ సర్పంచ్ అంగజాల అశోక్, నిర్వాహకులు, దర్గా కమిటీ సభ్యులు మహ్మద్ హసన్, షేక్ సోహేల్, ఎం.డి. అంకూస్, దేవేందర్, రఫీక్, తాజ్, గౌస్, హబీబ్, ఖమర్, కాంగ్రెస్ నాయకులు ముక్కెర తిరుపతి, గోనె మహేష్, సింగనవేన మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును చురుగ్గా చేపట్టాలి

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న గరికపాటి మోహన్‌రావు

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): ములుగు జిల్లాలో సభ్యత్వ నమోదు కార్య క్రమాన్ని చురుగ్గా చేపట్టి ప్రతి బూత్‌స్థాయిలో 100 సభ్యత్వాలు సేకరిం చాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు అన్నారు. గురు వారం ములుగులోని పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన జరిగిన సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ వికసిత్ భారత్ లక్ష్యంగా అనేక ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నందున గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు పర్యటించి ప్రజలకు వివరించాలని, దీంతోపాటు సభ్యత్వ నమోదు సేకరణ అధికసంఖ్యలో చేపట్టాలన్నారు. అనంతరం జిల్లాలో అత్యధిక సభ్యత్వాలు సేకరించిన మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకూబ్‌పాషా, గంగిశెట్టి రాజ్‌కుమార్, జినుకల కృష్ణాకర్‌రావును శాలువాలతో సన్మానించారు. ఈసమావేశంలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, జిల్లా సభ్యత్వనమోదు ప్రభారి కేవీఎల్ఎన్.రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా కృష్ణవేణినాయక్, జిల్లా సభ్యత్వ నమోదు ప్రముఖ్ మండల లవన్, క్రియాశీల సభ్యత్వ ప్రముఖ్ భూక్య జవహర్‌లాల్, రాష్ట్ర ఎస్టీమోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీల ప్రక్రియ పూర్తి

మొగుళ్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ ఈనెల 11న కమిటీల నియామకంపై ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీల పేరు రెండు, మూడు రోజుల్లోనే పంపించాలని పేర్కొనడంతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందిరమ్మ కమిటీలో ఐదుగురు చొప్పున మొత్తం మండల వ్యాప్తంగా 125 మందితో కమిటీలను ఏర్పాటు చేశారు. 25 గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఇందిరమ్మ కమిటీల్లో సర్పంచ్‌ల స్థానంలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈకమిటీలో స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు మహిళలు, గ్రామీణాభివృద్ధిపై అవగాహన కలిగినవారు మరో ముగ్గురు గ్రామస్థులు ఉంటారు. వీరిలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు స్థానం కల్పించారు. సంక్షేమ పథకాలు, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ఇందిరమ్మ కమిటీలకు కీలకమైన బాధ్యతలు అప్పగిస్తారని కమిటీ సభ్యులు భావిస్తున్నారు. ఈ కమిటీల జాబితాను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోకు అప్పగించగా సంబంధిత జిల్లా అధికారులకు పంపించినట్లు సమాచారం.

కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి జయంతి వేడుకల్లో కలెక్టర్

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ములుగులోని కలెక్టర్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా కలెక్టర్ దివాకర వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచం ఉన్నంతవరకు రామాయణం, వాల్మీకి చరిత్ర ఉంటుందని, ఇతిహాసాల్లో మొదటిది రామాయణం, మహాభారతమని అన్నారు. అలాంటి రామాయణాన్ని రచించింది ఒక బోయకులానికి చెందిన చోరుడు అయిన వాల్మీకి అని పేర్కొన్నారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో అనేకమంది రచయితలుగా, కవులుగా మారారని అన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీపీఆర్‌వో రఫిక్, కలెక్టరేట్ కార్యా లయ సూపరింటెండెం ట్లు మహేష్‌బాబు, శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో..

కాకతీయఖని(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి జీఎం కార్యాలయంలో ఎస్‌వోటూజీఎం కవీంద్ర వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అధికారులు రవికుమార్, సురేఖ, వసంత్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇక 'అడ్వాన్స్‌డ్' ఐటీఐలు

(5వ పేజీ తరువాయి)

ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్‌లో 40, ఇండస్ట్రీయల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాను ఫ్యాక్చరింగ్‌లో 40, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్‌లో 20, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ మెకానికల్ 24, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మేషనింగ్ టెక్నీషియన్ 24, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్ 24 సీట్లు ఉన్నాయని ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీకి శిక్షణ పూర్తి

తొలిదశలో రాష్ట్ర వ్యాప్తంగా ఆరు కొత్త కోర్సుల్లో విద్యార్థులకు బోధించేందుకు ఇప్పటికే ఆయా ఐటీఐల ప్రిన్సిపాల్స్‌కు, ఫ్యాకల్టీకీ ప్రభుత్వం శిక్షణ ఇచ్చింది. ఈ కోర్సులను సెప్టెంబరు మాసంలోనే ప్రారంభించాలని నిర్ణయించగా కొంత ఆలస్యమైంది. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. అధ్యాపకులను సైతం నియమించారు.

విద్యార్థులకు సువర్ణావకాశం



ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఐటీఐల్లో ప్రవేశపెడుతున్న కొత్త కోర్సులు విద్యా ర్థులకు ఎంతో మేలు చేస్తాయి. వీటి ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి. ఈ కోర్సులకు బాగా డిమాండ్ ఉంది. ఇది విద్యార్థులకు సువర్ణవకాశం.

- జుమ్లానాయక్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్(భూపాలపల్లి)

పంచాయతీ కార్యదర్శికి తీవ్ర గాయాలు

గణపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి పంచాయతీ కార్యదర్శికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చెల్పూరు గ్రామ శివారులో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలం మోరంచపల్లి జీపీ పంచాయతీ కార్యదర్శి బండి శారీష్ వ్యక్తిగత పని నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లాడు. తిరుగు ప్రయా ణంలో గణపురం మండలం జెన్కో ఐమాక్స్ సమీ పంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపో యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు హనుమకొండలోని ఓ ఆస్ప త్రికి తరలించారు.

గ్రంథాలయ పుస్తకాల పంపిణీ

వాజేడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్ విద్యార్థులకు భారత్ బాలరక్ష స్వచ్ఛంద సేవా సంస్థ వారు ఫ్యూర్ ప్లే ఆర్థిక సాయంతో గ్రంథాలయ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి శ్రీకాంత్, హెచ్‌ఎం సోయం ఆనందరావు, ఉపాధ్యా యులు స్వరూప్ సింగ్, మల్లయ్య, రంగు ఆనంద్, నూనావత్ శ్రీకాంత్, ప్రభాకర్, శ్రీరంగం, అమ్మాజిరాణి, వస్య తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల లైబ్రరీ నిర్వహణ కోసం బాలరక్ష భారత్ స్వచ్ఛందసంస్థ ఫ్యూర్‌ప్లే సహకారంతో ఎంఈవో సత్యనారాయణ చేతుల మీదుగా పుస్తకాలను అందజేసింది. బాలరక్ష భారత్ స్వచ్ఛందసంస్థ నిర్వాహ కులు శ్రీకాంత్, ఉపాధ్యాయులు బొల్లె శ్రీని వాస్, రాందేవ్, వెంకటేశ్, రామకోటి, నాగమణి, ప్రదీప్, భిక్షమణి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కాకతీయఖని, అక్టోబరు 17,(ఆంధ్రజ్యోతి): స్ట్రక్చర్ సమావేశం ఏర్పాటు చేసి సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహరావు డిమాండ్ చేశారు. భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5వ గని వద్ద కార్మికులతో గురువారం ఆయన మాట్లాడారు. సింగరేణిలో ఎన్నికలు జరిగి 10 నెలలు కావస్తున్నా సమస్యల పరిష్కారానికి చొరవ చూపడంలేదన్నారు. సొంతింటి కల, పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్ రద్దు, మారుపేర్ల సమస్య, విజిలెన్స్ పేరుతో పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



తాడిచర్ల శివారు దేశబంధం నుంచి మట్టిని తరలిస్తున్న లారీ


మల్హర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తాడిచర్ల శివారులోని దేశబంధంలోని ప్రభుత్వ భూమి నుంచి ఎక్స్‌కావేటర్ సాయంతో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా జిల్లాలపల్లిలో సాగుతున్న తాడిచర్లకు సంబంధించిన ఇసుక క్వారీకి ఈ మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం. మట్టి రవాణా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మట్టి రవాణా సాగుతున్న విషయం బయటకు పొక్కడంతో చివరకు నిలిపి వేశారు.

ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలి

● సీపీఐ (ఎంఎల్)-లిబరేషన్ జిల్లా కార్యదర్శి మల్లేష్

టేకుమట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని సీపీఐ (ఎంఎల్)-లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్యాలయాల నిర్మాణానికి స్థలం కేటాయించి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేసి ఆరు నెలలు పూర్తి కావస్తున్నా పనులు ప్రారంభించకపోవడమేటని ప్రశ్నించారు. టేకుమట్ల నూతన మండలంగా ఏర్పాడినప్పుడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తహసీల్దార్ కార్యాలయంకు కేటాయించి ఆ పాఠశాలను హైస్కూల్‌కు తరలించారని, అక్కడ సరిపడా గదులు లేక అనేక ఇబ్బందుల నడుమ పాఠశాల కొనసాగుతోందని తెలిపారు. కలెక్టర్ స్పందించి వెంటనే నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్



ములుగు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడిగా ములుగు మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన బాదం ప్రవీణ్ ఎన్నికయ్యారు. ములుగులోని అసోసియేషన్ కార్యాలయంలో గురువారం అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలు జరిగాయి. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా పల్లెపాటి సమ్మిరెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా బాదం ప్రవీణ్, జనరల్ సెక్రటరీగా గురిజాల సహోదర్‌రెడ్డి, జిల్లా కోశాధికారిగా ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొమురవెల్లి హరినాథ్, ఉపాధ్యక్షులుగా కాసిడి సుదర్శన్‌రెడ్డి, అక్కల రఘోత్తం, సంయుక్త కార్యదర్శులుగా డ్యాగల భద్రయ్య, వీఎస్.రెడ్డి, ఈసీ మెంబర్లుగా లక్ష్మీనారాయణ, వేలేందర్‌తోపాటు శాశ్వత ఆహ్వానితులుగా అనిల్‌కుమార్, శ్రవణ్‌కుమార్ ఎన్నికయ్యారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోటార్లు తొలగించుకోవాలి

గోవిందరావుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్నవరం సరస్సు ఆయకట్టు పరిధిలో రాంనగర్, ఎల్బీనగర్, దుంపెల్లిగూడెం, పాపయ్యపల్లి, బాలాజీనగర్, సంద్రగూడెం గ్రామాల్లో శ్రీరాంపతి కాల్వపై అక్రమంగా మోటార్లు ఏర్పాటు చేసి నీటిని తరలిస్తున్న సాగుదారులు మోటార్లను తొలగించాలని నీటిపారుదల శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఎవరైనా మోటార్లతో నీటిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కేంద్ర విధానాలపై పోరాడాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవికుమార్

ఏటూరునాగారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ పోరాటాలు ఉధృతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎమ్డీ. దావూద్ అధ్యక్షతన పార్టీ ములుగు జిల్లా విస్తృత స్థాయి సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అటవీ పరిరక్షణ చట్టం 2022, ఏజెన్సీ ప్రాంతాల్లోని ఇతర చట్టాలను అతిక్రమిస్తోందని విమర్శించారు. అదానికి 4.5 లక్షల ఎకరాల అటవీ భూమిని కేటాయించిందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలోని రామగుండంలో రాడార్ యంత్రాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించిందని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ ఢిల్లీలో బీజేపీకి వ్యతిరేకంగా నికరంగా పోరాడుతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం పూర్తిగా దాటవేసే వైఖరి అవలంభిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యావర్గ సభ్యుడు బీరెడ్డి సాంబశివరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు తీగల ఆదిరెడ్డి, రత్నం రాజేందర్, కొప్పుల రఘుపతిరావు, పొదిళ్ల చిట్టిబాబు, గొంది రాజేష్, ఎమ్డీ. గఫూర్ పాషా, దుగ్గి చిరంజీవి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీని పరిశీలించిన ఎమ్మెల్యే

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 17: భూపాలపల్లిలోని మెడికల్ కళాశాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం పరిశీలించారు. మెడికల్ కళాశాలలో చదువుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంకా తరగతులు ప్రారంభం కాలేదని, అలాగే తమకు తరగతి గదులు సరిపోను లేవని, హాస్టల్ సౌకర్యం కూడా లేదని ఎమ్మెల్యే జీఎస్ఆర్‌కు బుధవారం వినతి పత్రాన్ని సమర్పించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే గురువారం కళాశాలను సందర్శించి కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఇతర సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో వారికి ప్రిన్సిపాల్ సమస్యల గురించి విన్నవించారు. దీంతో స్పందించిన ఆయన అధ్యాపకుల నియామకం, అలాగే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం విషయంపై హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా సమీపంలోని రామప్ప కాలనీలో కేటాయించిన 39, 40 బ్లాకు క్వార్టర్లను పరిశీలించారు. నూతనంగా అడ్మిషన్లు పొందే విద్యార్థులకు వసతి కల్పించేందుకు గాను సింగరేణి అధికారులతో మాట్లాడుతానని చెప్పారు. ప్రస్తుతం వరకు ఇందులో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అవసరమైతే ఆయుష్ భవనాన్ని అప్పగించేలా ప్రభుత్వంతో మాట్లాడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల అధ్యాపక బృందం, కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, బుర్ర కొంరయ్య, ముంజాల రవీందర్, శిరుప అనిల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.